సాక్షి
తూర్పుగోదావరి

సోమవారం । 9 । జూన్ । 2025



రూ.లక్ష విరాళం

రాజానగరం: తోకాడలో అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి బీజేపీ నాయకుడు కంబాల శ్రీనివాసరావు రూ.లక్ష విరాళం ప్రకటించారు.




మాన్యువల్ కౌన్సెలింగ్‌కే మొగ్గు

బదిలీల్లో సెకండరీ గ్రేడ్ టీచర్లకు వెబ్ కౌన్సెలింగ్ ద్వారా కాకుండా మాన్యువల్ విధానంలో కౌన్సెలింగ్ నిర్వహించాలనే డిమాండ్‌తో ఉపాధ్యాయులు ఆందోళన చేశారు.

8లో

కడలిలోకి 22,244 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి ఆదివారం 22,244 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. తూర్పు డెల్టాకు 200, మధ్య డెల్టాకు 100, పశ్చిమ డెల్టాకు 500 కలిపి కాలువలకు 800 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులుగా ఉంది.

న్యూస్‌రీల్

లేబర్ కోడ్స్ రద్దుకు వచ్చే నెల 9న సమ్మె



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

రాజమహేంద్రవరం సిటీ: కార్మిక హక్కులు హరించేలా రూపొందించిన లేబర్ కోడ్స్ రద్దు చేయాలనే డిమాండుతో దేశవ్యాప్తంగా వచ్చే నెల 9న నిర్వహించనున్న కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.సుందరబాబు, బి.పవన్ పిలుపునిచ్చారు. నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో సమ్మె వాల్‌పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 11 కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యాన సార్వత్రిక సమ్మె జరుగుతుందన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్పొరేట్‌లకు అనుకూలంగా, ఇప్పుడున్న హక్కులు కూడా లేకుండా కార్మికులను పూర్తిగా అణచివేసేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. పైకి మాత్రం చట్టాలను ఆధునీకరిస్తున్నామని చెబుతున్నా కార్మికులు పోరాడి సాధించుకున్న 29 చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్ పేరుతో రద్దు చేసే కుట్ర చేస్తోందని. దీనిని కార్మిక వర్గం తిప్పికొట్టాలని అన్నారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి కేఎస్‌వీ రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌టీహెచ్ ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

రాజమహేంద్రవరం రూరల్: ధవళేశ్వరం గ్రామ పంచాయతీ పరిధిలోని జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్(ఆర్‌టీహెచ్)ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వర్చువల్‌గా లేదా ప్రత్యక్షంగా ప్రారంభించనున్న నేపథ్యంలో ముందస్తు ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని జాయింట్ కలెక్టర్, నోడల్ అధికారి ఎస్.చిన్నరాముడు తెలిపారు. ఆర్‌టీహెచ్ కేంద్రాన్ని సమన్వయ శాఖల అధికారులతో కలిసి ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విశాఖపట్నంలో జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొంటారని, అక్కడి నుంచి వర్చువల్‌గా ధవళేశ్వరంలోని ఆర్‌టీహెచ్‌ను ప్రారంభిస్తారని చెప్పారు. ఒకవేళ నేరుగా హాజరైనా అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేశామని అన్నారు. ఆర్‌టీహెచ్‌ను ప్రారంభించిన అనంతరం ప్రభుత్వ, విద్యా సంస్థలు, పారిశ్రామికవేత్తలతో సీఎం సంభాషించి, వారి ఆలోచనలను తెలుసుకుంటారన్నారు. కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక అధికారి మార్టిన్ లూథర్, నగర పాలక సంస్థ ఎస్ఈ ఎంసీహెచ్ కోటేశ్వరరావు, ఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్, సౌత్ జోన్ డీఎస్పీ భవ్య కిషోర్, ఇన్‌చార్జి తహసీల్దార్ బి.శ్రీనివాస్, ఇన్‌చార్జి ఎంపీడీఓ ఆర్మ్‌స్ట్రాంగ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పీజీఆర్ఎస్

రాజమహేంద్రవరం రూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం సోమవారం కలెక్టరేట్‌తో పాటు డివిజన్, మండల స్థాయిల్లో జరుగుతుందని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వాట్సాప్ గవర్నెన్స్ నంబర్ 95523 00009 నంబర్ ద్వారా, 1100 నంబర్‌తో 'మీకోసం కాల్ సెంటర్'కు కూడా నేరుగా అర్జీ దాఖలు చేయవచ్చని పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి ఆధ్వర్యాన అర్జీలు స్వీకరిస్తారన్నారు.

యోగాపై నేడు ర్యాలీ

రాజమహేంద్రవరం రూరల్: యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా యోగా సాధకులతో సోమవారం జిల్లా స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకూ ర్యాలీలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ పి.ప్రశాంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రం రాజమహేంద్రవరంలో జిల్లా యంత్రాంగం, రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ, ఆయుష్, వైద్య, ఆరోగ్య, ఇతర ప్రభుత్వ శాఖల సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులు, మహిళలు, విద్యార్థులతో కలిసి ఉదయం 7 గంటలకు స్థానిక వై జంక్షన్ నుంచి దేవీచౌక్ వరకూ, తిరిగి వై జంక్షన్ వరకూ ర్యాలీ నిర్వహించనున్నట్లు వివరించారు.

172 మంది విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లా పరిధిలో 48 మంది ఇంటర్, 124 మంది పదో తరగతి విద్యార్థులకు సోమవారం షైనింగ్ స్టార్స్ ప్రతిభా అవార్డులు అందజేస్తున్నట్లు డీఈఓ కె.వాసుదేవరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. త్యాగరాజ నారాయణ దాస సేవా సమితిలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. మెరుగైన ఫలితాలు సాధించిన ఈ విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డుతో పాటు రూ.20 వేల నగదు పురస్కారం, ధ్రువపత్రం అందజేస్తామన్నారు.

ప్చ్.. నిరాశే..





- పుంజుకోని పొగాకు మార్కెట్
- లో గ్రేడ్‌కు ట్రేడర్లు నో
- నాణ్యతకే ప్రాధాన్యం
- గిట్టుబాటు ధర దక్కక రైతుల గిలగిల

దేవరపల్లి: రాష్ట్రంలో పొగాకు కొనుగోళ్లు ప్రారంభించి దాదాపు రెండు నెలలు దాటింది. ఇప్పటికీ మార్కెట్ పుంజుకోవడం లేదు. పొగాకు బోర్డు రాజమహేంద్రవరం రీజియన్ పరిధిలోని ఐదు వేలం కేంద్రాల్లో ఉత్తర తేలిక నేలల్లో (ఎన్ఎల్ఎస్) పండే పొగాకు కొనుగోళ్లను ఈ ఏడాది మార్చి 24న ప్రారంభించారు. ఇప్పటి వరకూ 59 రోజులు వేలం నిర్వహించినా ధరలో పెరుగుదల లేకపోవడంతో రైతులు నిరాశ చెందుతున్నారు. దీంతో, వేలం కేంద్రాలకు వస్తున్న బేళ్లు తక్కువగా ఉంటున్నాయి. సాధారణంగా జూన్ రెండో వారం నాటికి సుమారు 50 నుంచి 55 శాతం పొగాకు విక్రయాలు జరిగేవి. ప్రస్తుతం అది 25 శాతానికే పరిమితమైంది.

రైతు.. కుదేలు

గత ఏడాది పొగాకుకు ఊహించని ధర పలికి, మంచి లాభాలు రావడంతో రైతులు కుబేరులయ్యారు. కిలోకు రూ.410 ధర లభించడంతో ఎకరాకు దాదాపు రూ.4 లక్షల ఆదాయం వచ్చింది. దీంతో, అధిక శాతం రైతులు పొగాకు సాగుపై మొగ్గు చూపారు. కనీసం ఎకరం పొలం లేని రైతులు 5 నుంచి 10 ఎకరాలు కౌలుకు తీసుకుని పంట వేశారు. అధిక పెట్టుబడులు పెట్టి పంట పండించారు. తీరా పండించిన పొగాకును వేలం కేంద్రాలకు తీసుకు వెళ్లిన రైతులకు ఎదురు దెబ్బ తగిలింది. ఏటా అత్యధికంగా పొగాకు కొనుగోలు చేసే కంపెనీలు కూడా ఈసారి అంతంత మాత్రంగానే కొంటున్నాయి. దీంతో, రైతులు సాగుకు తెచ్చిన అప్పులు గుర్తుకు తెచ్చుకుని ఆందోళన చెందుతున్నారు. ఎకరం విస్తీర్ణంలో పొగాకు సాగుకు రూ.3 లక్షల వరకూ ఖర్చవుతోంది. ఎకరం కౌలు రూ.70 వేలు, బ్యారన్ అద్దె రూ.50 వేలు, పెట్టుబడి దాదాపు రూ.1.50 లక్షలు అవుతోంది. చాలా మంది బ్యారన్‌కు రూ.7 లక్షల నుంచి రూ.8 లక్షల వరకూ బ్యాంకుల నుంచి అప్పు తీసుకుని పెట్టుబడి పెట్టి పంట పండించారు. తీరా చూస్తే మార్కెట్లో గిట్టుబాటు ధర లభించడం లేదు. ఇదే ధర కొనసాగితే ఎకరాకు రూ.లక్ష నష్టం వస్తుందని రైతులు దిగులు చెందుతున్నారు. గత అప్పులకు కొత్త అప్పులు తోడవడంతో రుణభారం పెరిగిందని కౌలు రైతులు లబోదిబోమంటున్నారు. ప్రస్తుతం కొనుగోళ్లు మందగించడంతో రైతుల వద్ద పొగాకు నిల్వలు పేరుకుపోయాయి. వేలానికి వస్తున్న బేళ్లే తక్కువగా ఉండగా.. వాటిని కూడా ట్రేడర్లు పూర్తిగా కొనుగోలు చేయకుండా తిరస్కరిస్తున్నారు.

పరిమితికి మించి.. పండించి..

రైతులు 2024–25 పంట కాలంలో పరిమితికి మించి పొగాకు పండించారు. ఎన్ఎల్ఎస్ ప్రాంతంలో 59 మిలియన్ల పంటకు పొగాకు బోర్డు అనుమతి ఇచ్చి, రిజిస్ట్రేషన్ చేసింది. గత ఏడాది వచ్చిన ధర చూసి, ఆశపడి, అధిక విస్తీర్ణంలో సాగు చేయవద్దని అధికారులు, ట్రేడర్లు, రైతు సంఘాల ప్రతినిధులు చెబుతూనే ఉన్నారు. ఈ ఏడాది జింబాబ్వే, బ్రెజిల్ దేశాల్లో పొగాకు ఉత్పత్తి గణనీయంగా పెరిగినందున అంతర్జాతీయ మార్కెట్లో డిమాండ్ తగ్గుతుందని, దీనిని దృష్టిలో పెట్టుకుని పంట వేయాలని సూచించారు. కానీ, ఈ ఏడాది కూడా మంచి ధర వస్తుందనే ఉద్దేశంతో నిషేధిత భూముల్లో కూడా రైతులు అనుమతి లేకుండా పంట సాగు చేశారు. **దీంతో ఉత్పత్తి 80 మిలియన్ల** కిలోలకు చేరింది. 24,450 హెక్టార్లలో పొగాకు సాగు చేసినట్టు అధికారులు చెబుతున్నప్పటికీ, దాదాపు 40 వేల హెక్టార్లలో పంట వేసినట్టు సమాచారం. ఈవిధంగా కొనుగోలు సంస్థల అవసరానికి మించి పంట ఉత్పత్తి కావడంతో మార్కెట్ సంక్షోభంలో పడినట్టు అధికారులు చెబుతున్నారు.

తక్కువ ధరకు బ్లాక్ సాయిల్ పొగాకు

దక్షిణాదిన నల్లరేగడి భూముల్లో పండించిన పొగాకు తక్కువ ధరకు లభించడంతో కొనుగోలు సంస్థలు అక్కడే ఎక్కువగా కొనుగోళ్లు చేస్తున్నారు. బ్లాక్ సాయిల్ పొగాకు కిలో రూ.180కి లభిస్తుండగా, ఎన్ఎల్ఎస్ పొగాకు రూ.290 నుంచి రూ.220 వరకూ పలుకుతోంది. బ్లాక్ సాయిల్, ఎన్ఎల్ఎస్ పొగాకులో నికోటిన్ శాతం సమానంగా ఉండడంతో కొనుగోలుదారులు అక్కడి పొగాకు కొనుగోలుకే మొగ్గు చూపుతున్నారని సమాచారం. ఎన్ఎల్ఎస్ పొగాకు కంటే బ్లాక్ సాయిల్ పొగాకు కిలో రూ.50 నుంచి రూ.80 తక్కువకు వస్తోందని వ్యాపారులు చెబుతున్నారు. అయితే, పంట ఎక్కువగా పండినందున కొనుగోలు సంస్థలు సిండికేట్‌గా మారి ఇబ్బంది పెడుతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు.

దేవరపల్లి కేంద్రానికి వేలానికి వచ్చిన పొగాకు బేళ్లు

ఖరారు కాని ఎగుమతి ఆర్డర్లు

గుంటూరు ప్రధాన కేంద్రంగా ఉన్న పొగాకు బోర్డు తన పరిధిలో వేలం కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు, ట్రేడర్‌కు మధ్యవర్తిగా పని చేస్తుంది. దీనికి గాను రైతు, ట్రేడర్ నుంచి కిలోకు చెరొక రూపాయి చొప్పున కమీషన్ తీసుకుంటుంది. పంట ధరను బోర్డు నిర్ణయించదు. మార్కెట్లో డిమాండ్, సరఫరాను బట్టి ధర వస్తుంది. పొగాకు ఎగుమతి ఆర్డర్లు ఇంత వరకూ ఖరారు కాలేదు. ప్రధాన ఎగుమతి సంస్థలు పొగాకు శాంపిల్స్‌ను వివిధ దేశాల్లోని సిగరెట్ తయారీ సంస్థలకు పంపించాయి. మొదట పంపిన శాంపిల్స్ వారికి నచ్చకపోవడంతో రెండోసారి మళ్లీ పంపించారు. ఈ నేపథ్యంలో ఆయా ఏజెన్సీల ప్రతినిధులు ఈ ప్రాంతంలో పర్యటించి పొగాకును పరిశీలించి వెళ్లారు. త్వరలో ఆర్డర్లు రావచ్చని అధికారులు భావిస్తున్నారు.

రూ.425.62 కోట్ల పొగాకు విక్రయాలు

ఎన్ఎల్ఎస్ ప్రాంతంలోని ఐదు వేలం కేంద్రాల్లో ఇప్పటి వరకూ రూ.425.62 కోట్ల విలువైన పొగాకు విక్రయాలు జరిగాయి. కిలోకు గరిష్టంగా రూ.290, కనిష్టంగా రూ.200, సగటున రూ.274.95 చొప్పున ధర పలికింది. ట్రేడర్లు 1,19,775 బేళ్లు కొనుగోలు చేశారు. పొగాకును నాలుగు గ్రేడులుగా విభజించి రైతులు బేళ్లు తయారు చేస్తారు. మొదటి గ్రేడు పొగాకు కొనుగోలు చేస్తున్న ట్రేడర్లు మిగిలిన గ్రేడ్‌ల పొగాకు కొనడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు.

రైతులను ఆదుకున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం

- వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2014లో ప్రతిపక్ష నేతగా దేవరపల్లి పొగాకు వేలం కేంద్రాన్ని సందర్శించారు. గిట్టుబాటు ధర ఇవ్వకపోతే గుంటూరు బోర్డు కార్యాలయం వద్ద రైతులకు అండగా ధర్నా చేస్తానని ప్రకటించారు, అనంతరం కిలోకు రూ.10 నుంచి రూ.17 వరకూ ధర పెరిగి, రైతులకు మేలు జరిగింది.
- 2020 పంట కాలంలో పొగాకు మార్కెట్ సంక్షోభంలో పడి, రైతుల వద్ద లో గ్రేడ్ పొగాకు కొనుగోలుకు ట్రేడర్లు ముందుకు రాని పరిస్థితి ఏర్పడింది. ఈ విషయం తెలుసుకున్న అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మార్క్‌ఫెడ్ ద్వారా రైతుల వద్ద ఉన్న లో గ్రేడ్ పొగాకును గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయించారు. మార్క్‌ఫెడ్‌కు రూ.200 కోట్లు మంజూరు చేసి, సుమారు 16 మిలియన్ల కిలోల పొగాకును కొనుగోలు చేయించారు.
- 2004లో పాదయాత్ర చేపట్టిన అప్పటి ప్రతిపక్ష నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి కూడా దేవరపల్లి పొగాకు వేలం కేంద్రాన్ని సందర్శించి రైతుల ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం 2005–06 పంట కాలంలో పండించిన పొగాకును కేంద్ర ప్రభుత్వం ద్వారా గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయించారు.

త్వరగా అమ్ముకోవాలి



వేలానికి బేళ్లు తక్కువగా వస్తున్నాయి. కొనుగోళ్లు మందకొడిగా జరుగుతున్నాయి. చాలా మంది రైతులు ఇప్పటి వరకూ కిలో పొగాకు కూడా అమ్మలేదు. వారికి నోటీసులిచ్చాం. వర్షాలు పడితే పొగాకు నాణ్యత దెబ్బ తింటుంది. ప్రస్తుతం మీడియం, బ్రైట్ గ్రేడ్ పొగాకు కొనుగోలు చేస్తున్నారు. ఇంతవరకూ 15.48 మిలియన్ల కిలోల పొగాకు విక్రయాలు జరిగాయి. అమ్ముడుపోతున్న గ్రేడ్ పొగాకును వేలానికి తీసుకురావాలి. రైతులు తమ వద్ద మున్న పొగాకును త్వరితగతిన అమ్ముకోవాలి.

– జీఎల్‌కే ప్రసాద్, రీజినల్ మేనేజర్, పొగాకు బోర్డు, రాజమహేంద్రవరం

జాగ్రత్తగా అమ్ముకోవడం మంచిది



రాష్ట్రంలో 167 మిలియన్ల కిలోల పొగాకు ఉత్పత్తికి అనుమతి ఇవ్వగా 240 మిలియన్ల కిలోలు పండింది. బర్లీ పొగాకు అధికంగా పండింది. అంతర్జాతీయంగా ప్రతి దేశంలోనూ పంట ఉత్పత్తి పెరిగింది. ఈ పరిస్థితిని అధికారులు, కంపెనీలు ముందు నుంచీ చెప్పినా ఒక్క రైతూ వినలేదు. బ్యారన్‌కు (4 ఎకరాల్లో) 41.25 క్వింటాళ్లు పండించాల్సి ఉండగా, 100 క్వింటాళ్లు పండించిన రైతులున్నారు. ఈ ఏడాది దెబ్బ తిన్న రైతులు ఎక్కువగానే ఉన్నారు.

– గద్దే శేషగిరారావు, మాజీ వైస్ చైర్మన్, పొగాకు బోర్డు

రత్నగిరిపై భక్తుల సందడి

- సత్యదేవుని దర్శించిన 30 వేల మంది
- దేవస్థానానికి రూ.30 లక్షల ఆదాయం

అన్నవరం: వేలాదిగా తరలి వచ్చిన భక్తులతో రత్నగిరి ఆదివారం కిక్కిరిసిపోయింది. రత్నగిరితో పాటు, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో శనివారం రాత్రి, ఆదివారం తెల్లవారుజామున పెద్ద సంఖ్యలో వివాహాలు జరిగాయి. ఆ వివాహాలు చేసుకున్న నవ దంపతులు, వారి బంధుమిత్రులతో పాటు ఇతర భక్తులుకూడా పెద్ద సంఖ్యలో సత్యదేవుని దర్శనానికి తరలి వచ్చారు. దీంతో, స్వామివారి ఆలయ ప్రాంగణం, క్యూలు, వ్రత, విశ్రాంత మండపాలు కిటకిటలాడాయి. భక్తుల రద్దీ సాయంత్రం వరకూ కొనసాగింది. సుమారు 30 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారని అధికారులు తెలిపారు. స్వామివారి వ్రతాలు రెండు వేలు జరిగాయి. ఉచిత దర్శనానికి గంట, ప్రదక్షిణ దర్శనానికి అరగంట పట్టింది. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో ప్రదక్షిణ చేసి, రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి, పూజలు చేశారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.30 లక్షల ఆదాయం వచ్చిందని అధికారులు తెలిపారు. నిత్యాన్నదాన పథకంలో 5 వేల మంది సత్యదేవుని అన్న ప్రసాదం స్వీకరించారు. సత్యదేవుని రథసేవను ఉదయం ఘనంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను ఆలయ ప్రాంగణంలో మూడుసార్లు ఊరేగించిన అనంతరం నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి, భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

కంప్యూటర్ ఇంజినీరింగ్‌పై గురి

- ఏపీ ఈఏపీ సెట్ టాపర్ల మనోగతం
- పలువురికి ఉత్తమ ర్యాంకులు



రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్రంలోని ఇంజినీరింగ్, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ కళాశాలల్లో ప్రవేశాల కోసం గత నెలలో నిర్వహించిన ఏపీ ఈఏపీ సెట్ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. ఈ పరీక్షల ఫలితాలను సెట్ చైర్మన్, జేఎన్‌టీయూ–కాకినాడ వైస్ చాన్స్‌లర్ సీఎస్ఆర్‌కే ప్రసాద్, సెట్ కన్వీనర్ వీవీ సుబ్బారావు ఆదివారం సాయంత్రం విడుదల చేశారు. ఏపీ ఈఏపీ సెట్‌కు సంబంధించి ఇంజినీరింగ్ విభాగంలో 7,641 మంది, అగ్రికల్చరల్, ఫార్మసీ విభాగాల్లో 2,580 మంది, రెండు విభాగాల్లో ఐదుగురు దరఖాస్తు చేసుకున్నారు. ఈ పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థుల మనోగతమిదీ..



పేరు: ఆదిమూలం శ్రీహర్ష, అరవపాలెం, కడలి, రాజోలు
ర్యాంకు: 20
తండ్రి: ఆదిమూలం వీర రాఘవులు, టీచర్
తల్లి: ఆదిమూలం పద్మావతి, టీచర్
లక్ష్యం: ఐఐటీలో కంప్యూటర్ ఇంజినీరింగ్.



పేరు: కంచుమర్తి ప్రణీత్, రాజమహేంద్రవరం
ర్యాంకు: 36
తండ్రి: ప్రతాప్ జీవన్, ఏడీ, అగ్రికల్చర్
తల్లి: కంచుమర్తి మీనా, ఏఓ, అగ్రికల్చర్
లక్ష్యం: ముంబై ఐఐటీలో కంప్యూటర్ ఇంజినీరింగ్.



పేరు: డి.కిరీటి, రాజమహేంద్రవరం
ర్యాంకు: 8
తండ్రి: డాక్టర్ డీఎస్ అరుణ్ కుమార్, ఈఎన్‌టీ స్పెషలిస్ట్
తల్లి: లత, గృహిణి
లక్ష్యం: కార్డియాలజీ, స్కల్‌బేస్ స్పెషలైజేషన్



పేరు: చింతా సాయి కేశవరామ్, బొమ్మూరు
ర్యాంకు: 27
తండ్రి: చింతా శ్రీనివాస్, ప్రైవేటు ఉద్యోగి
తల్లి: చింతా శ్రీదేవి, గృహిణి
లక్ష్యం: ముంబై ఐఐటీలో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్.



పేరు: దువ్వి ఆశిష్ సాయి శ్రీకర్
ర్యాంకు: 66
తండ్రి: దువ్వి శ్యామ్ కిరణ్, వైద్యులు
తల్లి: నీలపాల పద్మజ, వైద్యులు
లక్ష్యం: ఐఐటిలో కంప్యూటర్ ఇంజినీరింగ్.



పేరు: ఎం.సూర్య సంతోష్‌రెడ్డి, పందలపాక, బిక్కవోలు మండలం
ర్యాంకు: 12
తండ్రి: డాక్టర్ మల్లిడి కృష్ణారెడ్డి, వైద్యుడు
తల్లి: సంధ్యాదేవి, కెమిస్ట్
లక్ష్యం: జనరల్ సర్జన్, గ్రామీణ ప్రజలకు వైద్య సేవలందించడం.



పేరు: వనపర్తి తేజశ్రీ, రాజమహేంద్రవరం
ర్యాంకు: 31
తండ్రి: వనపర్తి మల్లేశ్వరరావు, ఫైనాన్షియల్ అడ్వైజర్
తల్లి: లక్ష్మి, గృహిణి
లక్ష్యం: ఐఐటీ చదివి, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కావడం.



పేరు: కె.యశ్వంత్‌రాజా, మానేపల్లి, రాజోలు
ర్యాంకు: 26
తండ్రి: నాగ వెంకటరత్నం నాయుడు, టీచర్
తల్లి: సత్యవేణి, గృహిణి
లక్ష్యం: ఐఐటీ, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్



పేరు: ఎల్.అభిషేక్, ఎస్.కొత్తపల్లి, ఉప్పలగుప్తం
ర్యాంకు: 39
తండ్రి: గణపతి, ఆక్వా కల్చర్
తల్లి: లక్ష్మి, గృహిణి
లక్ష్యం: న్యూరోసర్జన్

రత్నగిరిపై మరో అపచారం!

- సత్యదేవుని వార్షిక కల్యాణ మండపం ముందు భారీ వివాహ సెట్టింగ్
- షెడ్డు సగం ఆక్రమించి అట్టహాసంగా వివాహం
- భక్తులకు ఇబ్బందులు



ఎర్రని వస్త్రం కట్టి, విశ్రాంతి షెడ్డు లోపలకు ఎవరూ రాకుండా వివాహం చేస్తున్న దృశ్యం

అన్నవరం: సత్యదేవుని వార్షిక కల్యాణ మండపం ముందు సాధారణంగా దేవస్థానం వైదిక కార్యక్రమాలు తప్ప మరే ఇతర కార్యక్రమాలూ నిర్వహించరు. అది కూడా వార్షిక కల్యాణ మండపాన్ని మూసివేసేలా ఎటువంటి సెట్టింగులనూ అనుమతించరు. వివాహ ముహూర్తాల సమయంలో ఆ కల్యాణ మండపం ముందున్న విశ్రాంతి మండపంలో పేద, మధ్యతరగతి వారు చిన్న చిన్న మండపాలు వేసుకుని వివాహాలు చేసుకుంటారు. ఆ షెడ్డు నిర్మించక ముందు నుంచే అక్కడ అలా వివాహాలు చేసుకుంటున్నారు. కానీ ఎప్పుడూ పెద్ద పెద్ద సెట్టింగ్‌లు వేసి వివాహాలకు అనుమతి లేదు. కానీ, ఆదివారం ఉదయం మాత్రం యలమంచిలికి చెందిన వారు స్వామివారి వార్షిక కల్యాణ వేదిక ముందు చాలా పెద్ద సెట్టింగ్ వేసి అట్టహాసంగా వివాహం చేశారు. వార్షిక కల్యాణ వేదిక ముందు దాతల సహకారంతో నిర్మించిన విశ్రాంతి షెడ్డును కుర్చీలు వేసి, సగం వరకూ ఆక్రమించేశారు. భక్తులు విశ్రాంతి తీసుకునేందుకు అక్కడకు రాకుండా బారికేడ్లు కూడా కట్టేశారు. ఉదయం 6 నుంచి 11.30 గంటల వరకూ ఈ వివాహ వేడుకలు నిర్వహించారు. మధ్యాహ్నం వరకూ ఆ సెట్టింగ్ అలాగే ఉంది. దీంతో మిగిలిన సగం షెడ్డులోనే సేద తీరుతూ భక్తులు ఇబ్బందులు పడ్డారు. మరోవైపు పక్కనే ఉన్న రామాలయంలో దర్శనానికి వచ్చిన వారు కూడా అవస్థలు పడ్డారు. ఈ వివాహ సెట్టింగ్ వలన పండితులు నిర్వహించిన సూర్య నమస్కారాలు కూడా భక్తులకు కనిపించలేదు. పండితులు ఆ సెట్టింగ్ వెనుకనే ఉండి ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ విశ్రాంతి షెడ్డును ఇప్పటి వరకూ ఈవిధంగా ఆక్రమించి, వివాహం జరిపిన సందర్భం లేదు. ఈవిధంగా చేయడానికి గతంలో ఎప్పుడూ ఎవ్వరూ అనుమతి కూడా ఇవ్వలేదు. స్వామివారి వార్షిక కల్యాణ మండపంలో వివాహం చేసుకోవడానికి నిర్వాహకులు దేవస్థానానికి రూ.10 వేలు చెల్లించారని అధికారులు చెప్పారు. వార్షిక కల్యాణ మండపం ముందు భాగాన్ని ఈ విధంగా ఆక్రమించి, వివాహం చేసుకోవడానికి అనుమతి ఇవ్వడం అపచారమేనంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పేట్రేగుతున్న మట్టి మాఫియా

- రంగంపేట మండలంలో జోరుగా మట్టి అక్రమ రవాణా
- తరలింపును అడ్డుకున్న మాజీ ఎమ్మెల్యే

రంగంపేట: మెట్ట ప్రాంతమైన రంగంపేట మండలంలో అక్రమార్కులు పేట్రేగిపోతున్నారు. సహజ వనరులను యథేచ్ఛగా దోచుకుంటున్నారు. చెరువులు తవ్వేస్తూ, గ్రావెల్‌ను విక్రయిస్తూ లక్షల రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారు. పచ్చదనాన్ని నాశనం చేస్తూ, నేలతల్లికి తూట్లు పొడుస్తున్నా అధికారులు ప్రేక్షక పాత్రకే పరిమితమవుతున్నారు. కళ్లెదుటే ఇంత జరుగుతున్నా అధికారులు, స్థానిక ఎమ్మెల్యే తమకేమీ కనిపించనట్లు వ్యవహరిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయరెడ్డి ధ్వజమెత్తారు. నల్లమిల్లి గ్రామంలోని జగన్నాథ సాగరం చెరువును లోతుగా తవ్వేసి, బిక్కవోలు మండలం పందలపాక గ్రామంలోని ప్రైవేట్ లే అవుట్‌కు మట్టిని తరలిస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి ఆ ప్రాంతాన్ని ఆదివారం పరిశీలించి లారీలను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు తమ పొలాలను సారవంతం చేసుకునేందుకు చెరువుల్లోని మట్టి తవ్వుకునేందుకు ప్రభుత్వం అనుమతిస్తుందని, కానీ ఈ నిబంధనను దుర్వినియోగం చేసి పది రోజులుగా 12 నుంచి 13 అడుగుల లోతును చెరువును తవ్వుతున్నారని అన్నారు. దీనివలన వర్షాలు కురిస్తే చెరువు గండి పడే ప్రమాదం ఉందని, నల్లమిల్లి గ్రామం మొత్తం మునిగిపోయే ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. గతంలో కూడా కాపవరం గ్రామంలో ఇలాగే తవ్వకాలు జరపడంతో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారని, డబ్బు కోసం ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడవద్దని హితవు పలికారు. నల్లమిల్లిలో పది రోజులుగా మట్టి అక్రమ రవాణా జరుగుతూంటే ఎమ్మెల్యే మొద్దునిద్ర వహిస్తున్నారని విమర్శించారు. మండలంలోని మరో రెండు చెరువుల్లో కూడా మట్టి అక్రమ రవాణా జరుగుతోందని, అక్కడకు కూడా వెళ్లి కూడా ప్రజలకు నిజానిజాలు తెలియజేస్తానని డాక్టర్ సూర్యనారాయణరెడ్డి చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సబ్బెళ్ల కృష్ణారెడ్డి, రిమ్మలపూడి వెంకటేశ్వరరావు, నల్లా శ్రీనివాసరావు, తుట్టా శివశంకర ఆనంద్, నల్లా దుర్గాప్రసాద్, మట్టా శ్రీను, కొండేపూడి చిన్నా, సోమిశెట్టి అప్పారావు, కంచుమర్తి సాయిబాబు పాల్గొన్నారు.



నల్లమిల్లిలో మట్టి తవ్వకాలు జరుగుతున్న జగన్నాథ సాగరం చెరువును పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి



గ్రావెల్ అక్రమ రవాణాను అడ్డుకుంటున్న మాజీ ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి

క్లుప్తంగా

గుర్తు తెలియని వ్యక్తి మృతి



రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం ప్రధాన రైల్వే స్టేషన్‌లో 3వ నంబరు ప్లాట్ ఫామ్‌పై అపస్మారకస్థితిలో ఉన్న సుమారు 50 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తిని ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడని జీఆర్పీ ఎస్‌ఐ మావుళ్లు తెలిపారు. మృత దేహాన్ని జీజీహెచ్‌లో మార్చురీలో భద్రపరిచామన్నారు. మృతుడు నలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నాడన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 94406 27551, 94914 44022 నంబర్లను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

అగ్రిగోల్డ్ బాధితుల కోసం పోరాటం



మాట్లాడుతున్న అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతిరావు

బోట్‌క్లబ్: అగ్రిగోల్డ్ బాధితుల కోసం చివరి వరకూ పోరాటం కొనసాగిస్తామని అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతిరావు అన్నారు. ఆదివారం స్థానిక గాంధీభవన్‌లో అసోసియేషన్ ఆధ్వర్యంలో అగ్రిగోల్డ్ బాధితుల సమావేశం నిర్వహించారు. బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే డబ్బులు చెల్లించాలని, చనిపోయిన వారి కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం మాట తప్పరాదన్నారు. ఎన్నికల ముందు కూటమి నాయకులు అగ్రిగోల్డ్ ఆస్తులు అమ్మి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని, కానీ ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని ఆయన ఆరోపించారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు మాట్లాడుతూ అగ్రిగోల్డ్ బాధితులకు ఇప్పటివరకూ పరిహారం అందిందంటే అది సంస్థ చేసిన పోరాట ఫలితమే అన్నారు. అగ్రిగోల్డ్ బాధితులను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోతే మరోసారి పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో సీపీఐ కాకినాడ జిల్లా కార్యదర్శి కె.బోడకొండ, అసోసియేషన్ సభ్యులు కె.భోగరాజు, పి.ఏసురాజు, వెంకన్న, అర్జునరావు, జిలానీ పాల్గొన్నారు.

బాలబాలాజీకి వైభవంగా చక్రస్నానం

- ఘనంగా వసంతోత్సవం
- నదీస్నానంతో పులకించిన భక్తజనం

మామిడికుదురు: బాల బాలాజీ స్వామి వారి దివ్య తిరు కల్యాణోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు ఆదివారం వైనతేయ గోదావరి నదిలో సుదర్శన పెరుమాళ్ చక్రస్నానం అంగరంగ వైభవంగా జరిగింది. భక్తుల గోవింద నామ స్మరణలు, వేద మంత్రాలు, మంగళ వాయిద్యాలు, భక్తుల కోలాహలం నడుమ సుదర్శన పెరుమాళ్‌కు గోదావరి నదిలో పుణ్యస్నానం చేయించారు. గ్రహ దోషాలు, అపమృత్యు దోషాలను నివారించే స్వామిగా ప్రాచుర్యం పొందిన సుదర్శన పెరుమాళ్‌తో పాటు గోవిందా.. గోవిందా.. గోవింద.. అంటూ భక్తులు గోదావరి నదిలో తలారా స్నానం చేసి పునీతమయ్యారు. చక్రస్నానం ఆద్యంతం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దేవస్థానం ఉప ముఖ్య అర్చకుడు మద్దాలి తిరుమలశింగరాచార్యులు, త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి శిష్య బృందం ఆధ్వర్యంలో ఉభయ దేవురులతో కొలువుదీరిన శ్రీవారికి ముందుగా సింహ వాహనంపై గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు వసంతాలు చల్లుకుంటూ అత్యంత భక్తిశ్రద్ధలతో ఉల్లాసంగా, ఉత్సాహంగా పాల్గొన్నారు. కేరళ వాయిద్యాలు గ్రామోత్సవంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ముందుగా శ్రీ, భూ సమేత స్వామివారితో పాటు సుదర్శన పెరుమాళ్‌కు నదీ తీరంలో జలాభిషేకం నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవతో స్వామి వారిని మేల్కొలిపారు. శ్రీవారికి సహస్ర నామార్చన, బాల భోగం నివేదన, వేదపారాయణ, నిత్యహోమం, పూర్ణాహుతి, బలిహరణ, తీర్థప్రసాద గోష్ఠి, ధ్వజావరోహణ, మంగళా శాసనం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపించారు. ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఉత్సవ కమిటీ సభ్యులతో పాటు అధిక సంఖ్యలో భక్తులు, దేవస్థానం ఉద్యోగులు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

నేటి కార్యక్రమాలు ఇలా..

స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం ఆరు గంటలకు స్వామి వారికి నిత్యార్చన, సహస్ర నామార్చన జరుగుతాయి. ఏడు గంటలకు స్వామి వారికి బాల భోగ నివేదన, నిత్య హోమం, బలిహరణ, తీర్థ ప్రసాద గోష్ఠి నిర్వహిస్తారు. తొమ్మిది గంటలకు చోర సంవాదం, సాయంత్రం ఏడు గంటలకు నిత్యారాధన, ద్వాదశ ప్రదక్షిణలు, ద్వాదశ నివేదనలు, శ్రీపుష్పయాగం, మంగళా శాసనాలు, మహదాశీర్వచనం, రుత్విక్ సన్మానం, తీర్థ ప్రసాద గోష్ఠి నిర్వహిస్తారు. ఉదయం, సాయంత్రం పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.



సింహ వాహనంపై స్వామి, అమ్మవార్ల గ్రామోత్సవం



ప్రత్యేక ఆకర్షణగా నిలచిన కేరళ వాయిద్యాలు



సుదర్శన పెరుమాళ్లకు వైనతేయ గోదావరి నదిలో జలాభిషేకం చేయిస్తున్న అర్చకులు

సత్యదేవుని సేవకు రారండీ..

- సేవకుల నమోదుకు పోర్టల్ ఏర్పాటు
- దళారుల మోసాలకు చెక్ పెడుతూ నిర్ణయం

సాక్షి ఇంపాక్ట్

అన్నవరం: రత్నగిరి వీర వేంకట సత్యనారాయణ స్వామి దేవస్థానంలో స్వచ్ఛంద సేవ కోసం అధికారులు ప్రత్యేక పోర్టల్‌ను ఏర్పాటు చేశారు. సేవకులు తమ పేర్లను దేవస్థానంలోని పీఆర్వో కార్యాలయంలో ముందస్తుగా నమోదు చేసుకునే వీలు కల్పిస్తూ ఇప్పటికే 08868 238163 నెంబర్ ఏర్పాటు చేశారు. http://annavaramdevasthanam.com/seva వెబ్ అడ్రస్ ఇచ్చి సేవకులకు తమ వివరాలు నమోదు చేసుకునేందుకు తాజాగా వెసులుబాటు కల్పించారు. శుక్రవారం సాక్షి దినపత్రికలో 'సేవకులకు తీరనున్న ఇక్కట్లు' శీర్షికన వచ్చిన వార్తలో మొబైల్ ఫోన్ ద్వారా వాట్సాప్‌లో వివరాలు తెలిపే అవకాశం ఇవ్వాలని సూచించడంతో ఈ వెబ్ అడ్రస్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు.



శుక్రవారం సాక్షి దినపత్రికలో 'సేవకులకు తీరనున్న ఇక్కట్లు' శీర్షికన ప్రచురితమైన కథనం

ఎలా నమోదు చేసుకోవాలంటే...

గూగుల్ అడ్రస్ బార్‌లో పై లింక్‌ను కాపీ చేసి ఎంటర్ చేస్తే ఓ దరఖాస్తు ఓపెన్ అవుతుంది. అందులో సేవా డీటైల్స్ అనే కాలమ్‌లో తేదీ, వ్యక్తిగతంగానా (ఇండివిడ్యువల్), బృందంగానా (గ్రూప్) వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. సర్వీస్ అనే కాలమ్‌లో కిచెన్, క్రౌడ్ మేనేజ్‌మెంట్, క్లీనింగ్, మెడికల్ ఆప్షన్లను ఎన్నుకుని ఏ సేవ చేయదలచుకున్నారో దానిని క్లిక్ చేయాలి.

రెండో పేజీలో పాస్‌పోర్టు సైజ్ ఫొటో అప్‌లోడ్ చేయాలి. తరువాత ఐడీ ప్రూఫ్ అనే చోట ఆధార్ కార్డు లేదా ఏదో ఒక గుర్తింపు కార్డు నమోదు చేయాలి. అలాగే పేరు, ఇంటిపేరు, తండ్రి లేదా భర్త పేరు, పుట్టిన తేదీ, వయసు, మొబైల్ నెంబర్, ఈ మెయిల్, బ్లడ్ గ్రూప్, ఆడ లేదా మగ అనేచోట ఆ వివరాలు నమోదు చేయాలి. శారీరక, మానసిక ఆరోగ్యం గురించి ఫిట్‌నెస్ ఉన్నచోట టిక్ పెట్టాలి. తరువాత వృత్తి, హోదా, రిటైర్డ్ వివరాలు, స్పెషలైజేషన్, పనిచేస్తున్న వారు ఆ వివరాలు, తమ అడ్రస్ వివరాలు నమోదు చేసి సబ్మిట్ చేయాలి. ఇది జరిగిన వెంటనే సేవకు నమోదు చేసుకున్న వివరాలలో ఉన్న వ్యక్తిగత ఫోన్ నంబర్‌కు వాట్సప్ మెసేజ్ వస్తుంది. అందులో సేవకు అనుమతి వచ్చిందా లేదా.. వస్తే ఏ రోజు, ఎన్నిగంటలకు, ఏ సేవకు వినియోగించబడతారనే వివరాలు వస్తాయి. ఆ మేరకు సేవకులు స్వామివారి సేవకు రత్నగిరికి నిర్ణీత సమయంలో వెళ్లాల్సి ఉంటుంది.

దేవస్థానంలో సేవ కోసం వచ్చే వారు ఎవరిని సంప్రదించాలో తెలిపే ఏర్పాటు లేక చాలా మంది మధ్యవర్తులను ఆశ్రయించి మోసపోతున్నారు. తెలంగాణ రాష్ట్రం మంచిర్యాలకు చెందిన 18 మంది మహిళా సేవకులు మోసపోయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఏర్పాటు చేసిన పోర్టల్‌ను విస్తృతంగా ప్రచారం చేయాలని భక్తులు కోరుతున్నారు.

మాన్యువల్ కౌన్సెలింగ్‌కే మొగ్గు

- ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల ధర్నా
- నేటి నుంచి జిల్లా కేంద్రాల్లో నిరాహార దీక్షలు
- రేపు విద్యాశాఖ డైరెక్టరేట్ ముట్టడికి నిర్ణయం



మాన్యువల్ కౌన్సెలింగ్ కోసం ఉపాధ్యాయుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ధర్నా

రాయవరం: ఉపాధ్యాయ బదిలీల్లో భాగంగా సెకండరీ గ్రేడ్ టీచర్లకు మాన్యువల్ విధానంలో కౌన్సెలింగ్‌పై ప్రభుత్వం నుంచి స్పష్టత రాలేదు. ఆన్‌లైన్ విధానంలో వెబ్ కౌన్సిలింగ్‌కు ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ససేమిరా అంటోంది. ఉపాధ్యాయులు మాన్యువల్ కౌన్సెలింగ్‌కే పట్టుబట్టడంతో వెబ్ ఆప్షన్లకు లింక్ ఓపెన్ చేసినప్పటికీ వారు ఆప్షన్లు ఇవ్వలేదు. శనివారం ఎంఈఓ కార్యాలయాల వద్ద ధర్నా చేసిన ఉపాధ్యాయులు దశలవారీ పోరాటంలో భాగంగా ఆదివారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డీఈవో కార్యాలయాన్ని ముట్టడించారు. ఐక్యవేదికలో భాగస్వాములుగా ఉన్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు, అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు ముట్టడిలో పాల్గొన్నారు. మాన్యువల్ కౌన్సిలింగ్‌లో ప్రభుత్వం నుంచి స్పష్టత రాకపోవడంతో సోమవారం నుంచి జిల్లా కేంద్రాల్లో నిరాహార దీక్షలు చేపట్టాలని, 10న పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్‌ను ముట్టడించాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నిర్ణయించింది. అలాగే విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు ఈ-మెయిల్, వాట్సప్ ద్వారా మెసేజీలు పంపాలని నిర్ణయించారు.

చెప్పేదొకటి.. చేసేదొకటి అన్నట్లుగా..

ఉపాధ్యాయుల బదిలీల విషయంలో రాష్ట్ర ప్రభుత్వ తీరు చెప్పేదొకటి.. చేసేదొకటి అన్నట్లుగా ఉందని ఉపాధ్యాయ సంఘాల నాయకులు మండిపడుతున్నారు. తమ హక్కులు, ఆత్మగౌరవంతో ఆటలాడుకుంటున్నారని ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎస్‌జీటీలకు మాన్యువల్ విధానంలో కౌన్సిలింగ్ నిర్వహిస్తామని చెప్పిన అధికారులు తాజాగా ఆన్‌లైన్ కౌన్సిలింగ్ అనడం మోసం కాదా అని జేఏసీ ప్రశ్నిస్తోంది.

సహాయ కేంద్రాల ఏర్పాటు

జిల్లాలోని 22 మండలాల్లో ఫెసిలిటేషన్ సెంటర్లను వెబ్ కౌన్సెలింగ్‌లకు ఏర్పాటు చేశారు. ఆన్‌లైన్ బదిలీ ఆప్షన్లు ఎంపిక చేసుకోవడంపై అవగాహన లేని వారికి మండల కేంద్రాల్లో సహాయ కేంద్రాలు సహాయపడనున్నాయి. జిల్లాలో సుమారు మూడు వేల మందికి పైగా ఎస్‌జీటీలు వెబ్ ఆప్షన్స్ ఎంపిక చేసుకుంటారని అంచనా.

నేడు చేరనున్న ఉపాధ్యాయులు

ఇప్పటికే బదిలీ ఉత్తర్వులు పొందిన స్కూల్ అసిస్టెంట్లు ఆదివారం సాయంత్రం రిలీవై సోమవారం ఉదయం కొత్త స్థానాల్లో చేరనున్నారు. ఈ మేరకు బదిలీ అయిన స్కూల్ అసిస్టెంట్లు, ఎస్‌జీటీ నుంచి స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి, అలాగే మిగులు స్కూల్ అసిస్టెంట్లుగా ఉండి, మోడల్ ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎంలుగా బదిలీ అయిన వారంతా సోమవారం విధుల్లో చేరనున్నారు. మున్సిపాలిటీ, కార్పొరేషన్, జెడ్పీ యాజమాన్యాల పరిధిలో వివిధ క్యాటగిరీల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 406 మంది పదోన్నతులు పొందారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఏపీ ఈఏపీసెట్‌లో 'శ్రీ షిర్డి సాయి'కి ర్యాంకులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఏపీ ఈఏపీ సెట్ ఫలితాలలో శ్రీ షిర్డీ సాయి జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలను సాధించారని ఆ విద్యా సంస్థల డైరెక్టర్ టి.శ్రీవిద్య ఆదివారం తెలిపారు. తమ దీక్ష్యా మెడికల్ అకాడమీలో శిక్షణ పొందుతున్న కె.పావన్ తనయ్ రాష్ట్ర స్థాయిలో 13వ ర్యాంకు సాధించాడన్నారు. ఎస్.విద్యాజ్యోతిశ్రీ 178వ ర్యాంకు, కె.శ్రీనాగసుధ 220, ఎమ్.సూర్య దనుశ్రీ 865, ఎల్.మోహన్ భీమేష్ 969 ర్యాంకులు సాధించారు. మొత్తం ఐదుగురు విద్యార్థులు వెయ్యిలోపు ర్యాంకులు సాధించగా, 19 మంది 5 వేలలోపు, 32 మంది 10 వేల లోపు ర్యాంకులు సాధించారన్నారు. విద్యాసంస్థల చైర్మన్ తంబాబత్తుల శ్రీధర్ మాట్లాడుతూ యేటా తమ విద్యార్థులు అన్ని పోటీ పరీక్షలలో అత్యుత్తమ ర్యాంకులు సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో విజేతలను, అందుకు కృషి చేసిన అధ్యాపక బృందాన్ని చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, దీక్ష్యా అకాడమీ డీన్ పి.నరసింహరావు అభినందించారు.



13వ ర్యాంకు సాధించిన పావన్‌తనయ్‌తో చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య తదితరులు

'తిరుమల' విజయకేతనం

రాజమహేంద్రవరం రూరల్: ఏపీ ఈఏపీ సెట్ ఫలితాలలో రాజమహేంద్రవరం తిరుమల ఐఐటీ అండ్ మెడికల్ అకాడమీ విద్యార్థులు రాష్ట్రస్థాయి మూడు, ఎనిమిది ర్యాంకులు సాధించారని తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. ఇంజినీరింగ్ విభాగంలో కె.యశ్వంత్ సాత్విక్ 3వ ర్యాంకును, ఏ.శ్రీహర్ష 20, కె.యశ్వంత్‌రాజా 26వ ర్యాంకు, సీహెచ్ సాయి కేశవరామ్ 27, వి.తేజశ్రీ 31, కె.ప్రణీత్ 36, బి.సాయిశ్రీకర్ 66, కె.శంకర్‌మానిక్ 77, కె.వినీష్ 93 ర్యాంకులు సాధించారని ఆయన తెలిపారు. వెయ్యి లోపు ర్యాంకులు తొమ్మిది మంది, రెండు వేల లోపు 280 మంది, ఐదు వేల లోపు 626 మంది, పది వేల లోపు 1012 మంది ర్యాంకులు సాధించారన్నారు. అగ్రికల్చర్ విభాగంలో డి.కిరీటి స్టేట్ 8వ ర్యాంకు, టి.సాహితి 55వ ర్యాంకును, కె.కశ్యప్ 58వ ర్యాంకును, పి.దినేష్ 73వ ర్యాంకును, టి.రామచంద్రన్ 77వ ర్యాంకును, ఎం.వైష్ణవి 81వ ర్యాంకును కైవసం చేసుకున్నారన్నారు. 100 లోపు 9 మంది, 1000 లోపు 85 మంది, 2000 లోపు 140 మంది, 5000 లోపు 272 మంది, 10000 లోపు 415 మంది ర్యాంకులు సాధించారని ఆయన తెలిపారు. ఈ విజయాలకు కారణమైన అధ్యాపకులను, విద్యార్థులను తిరుమలరావు, అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్‌బాబు, ప్రిన్సిపాల్ వి.శ్రీహరి అభినందించారు.



కె.యశ్వంత్ సాత్విక్, రాష్ట్రస్థాయి 3వ ర్యాంకు, ఇంజినీరింగ్



డి.కిరీటి, రాష్ట్రస్థాయి 8వ ర్యాంకు, అగ్రికల్చర్

సత్యగిరిపై మరో సత్రానికి శ్రీకారం

- సీతారామ సత్రం కూల్చకుండా మరమ్మతులు
- స్థలాన్ని పరిశీలించిన చీఫ్ ఇంజినీర్ శేఖర్
- 105 గదులతో, రూ.11.4 కోట్ల అంచనా వ్యయం

అన్నవరం: రత్నగిరి వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో 105 గదుల నూతన సత్రాన్ని నిర్మించనున్నారు. ఆదివారం దేవస్థానంలో పర్యటించిన దేవాదాయశాఖ చీఫ్ ఇంజినీర్ జీవీ శేఖర్ ఈ మేరకు ఆగమ పాఠశాల ముందు స్థలాన్ని సత్రం నిర్మాణానికి పరిశీలించారు. అనంతరం అక్కడే సత్రం నిర్మించాలని దేవస్థానం అధికారులను ఆదేశించారు.

శిథిలావస్థకు చేరిన సీతారామ సత్రం స్థలంలో రూ.11.4 కోట్లు అంచనా వ్యయంతో కొత్త సత్రం నిర్మాణానికి జనవరి నెలలో టెండర్లు పిలవగా 27 శాతం అంటే దాదాపు రూ.మూడు కోట్లు తక్కువకు టెండర్ దాఖలైన విషయం తెలిసిందే. అయితే ఈ సత్రాన్ని గతంలో పరిశీలించిన నిపుణుల కమిటీ ఈ సత్రానికి మరమ్మతులు చేస్తే మరి కొన్ని సంవత్సరాలు వినియోగించుకోవచ్చని తేల్చారు. కొత్తసత్రం మరో చోట నిర్మించాలని సూచించారు. దీంతో కొత్త సత్రం ఎక్కడ నిర్మించాలనే సందిగ్ధత ఏర్పడగా ఆదివారం అన్నవరం దేవస్థానంలో పరిశీలించిన సీఈ శేఖర్ ఆ మేరకు స్థలాన్ని నిర్ణయించారు. అలాగే నూతనంగా టోల్‌గేట్ వద్ద నుంచి ఆలయానికి రూ.కోటి వ్యయంతో నిర్మిస్తున్న రెండో మెట్లదారిని కూడా ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు, ఈఈలు నూకరత్నం, వి.రామకృష్ణ, డీఈలు గుర్రాజు, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.



నూతన సత్రం నిర్మాణానికి స్థలాన్ని పరిశీలిస్తున్న సీఈ శేఖర్, దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు తదితరులు

రూ.12.92 లక్షల రేషన్ బియ్యం పట్టివేత

రాజానగరం: స్థానిక జాతీయ రహదారిపై లారీలో అక్రమంగా తరలిస్తున్న రూ.12.92 విలువ చేసే రేషన్ బియ్యాన్ని మండల పౌరసరఫరాల శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి ఎంఎస్ఓ బాపిరాజు ఆదివారం ఇక్కడ విలేకరులకు తెలిపిన వివరాలిలు ఇలా ఉన్నాయి. స్థానిక బీపీసీఎల్ పెట్రోలు బంకు వద్ద ఆగివున్న అశోక్ లే లాండ్ లారీలో ఉన్న లోడును అనుమానంతో తనిఖీ చేయగా అందులో 28,090 కిలోల రేషన్ బియ్యం బస్తాలు ఉన్నాయన్నారు. అక్రమంగా తరలిస్తున్న ఈ బియ్యాన్ని స్వాధీనపర్చుకుని, లారీని సీజ్ చేశారు. డ్రైవర్ పరారవడంతో అందులో ఉన్న రికార్డులను బట్టి లారీని పల్నాడు జిల్లా, నకిరేకల్‌కు చెందిన బిజ్జం రవీంద్రరెడ్డికి చెందిన వాహనంగా గుర్తించారు. పరారైన డ్రైవర్‌పై నిత్యావసర వస్తువుల చట్టం 1955 లోని సెక్షన్ 7(1), ప్రభుత్వాన్ని మోసం చేసినందుకు సెక్షన్ 318 (4) బీఎన్ఎస్ చట్టం కింద కేసులు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

- గేదె అడ్డు రావడంతో వాహనం అదుపు తప్పి ఘటన
- కుమారుడు, వరసైన చెల్లెలికి తీవ్ర గాయాలు



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఇంటి మమత (ఫైల్)

పిఠాపురం: స్థానిక బైపాస్ రోడ్డులో రాపర్తి జంక్షన్ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గొల్లప్రోలు మండలం దుర్గాడకు చెందిన మహిళ ఇంటి మమత(32) మృతి చెందింది. పిఠాపురం పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు మమత, ఆమె 8 ఏళ్ల కుమారుడు సుహాస్, చెల్లెలు వరసయ్యే జగ్గంపేటకు చెందిన పెనుమర్తి సోమలత కలిసి మోటారు సైకిల్‌పై కాకినాడ నుంచి దుర్గాడ వెళ్తున్నారు. రాపర్తి జంక్షన్ వద్ద వారి వాహనానికి గేదె అడ్డుగా రావడంతో వాహనం అదుపు తప్పి వారు పడిపోయారు. ఈ ప్రమాదంలో మమత తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందింది. ఆమె కుమారుడు, చెల్లెలు తీవ్రంగా గాయపడ్డారు. వీరు కాకినాడ మెడికవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పట్టణ ఎస్సై మణికుమార్ కేసు నమోదు చేశారు. మమత మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు.

భారీ వాహనం ఢీకొని యువకుడి మృతి

మరొకరికి తీవ్ర గాయాలు

అమలాపురం టౌన్: అమలాపురం రూరల్ మండలం రోళ్లపాలెం వద్ద 216 జాతీయ రహదారి బైపాస్ రోడ్డులో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా, మరొక యువకుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు పి.గన్నవరం మండలం పెదకందాళపాలెం శివారు కాట్రగడ్డకు చెందిన యార్లగడ్డ శామ్యూల్ రాజు (బాబి) (22) వరసకు తమ్ముడైన యార్లగడ్డ ప్రదీప్‌తో యానాం వైపు నుంచి రాజోలు వైపు వస్తున్నాడు. వారిని బైపాస్ వద్ద గుర్తు తెలియని భారీ వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో శామ్యూల్ రాజు అక్కడకక్కడే మృతి చెందగా, ప్రదీప్ తీవ్ర గాయాలపాలయ్యాడు. అతనిని అత్యవసర చికిత్స స్థానికులు ఆస్పత్రికి తరలించారు. పట్టణ సీఐ పి.వీరబాబు, ఎస్సై ఎస్ఎస్ కిశోర్‌బాబు ప్రమాద స్థలికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు.



ఘటనా స్థలంలో దర్యాప్తు చేస్తున్న పట్టణ పోలీసులు

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి

కొత్తపల్లి: తీరప్రాంతంలో కేఎస్ఈజెడ్‌లోని ఓ ప్రముఖ కంపెనీలో ఒక యువకుడు విద్యుత్ షాక్‌తో మృతి చెందిన ఘటన ఆలస్యంగా తెలిసింది. కొత్త మూలపేట కేఎస్ఈజెడ్‌లో రొయ్యలు శుద్ధిచేసే సంస్థలో కూలిపనులు చేస్తున్న ఒక యువకుడికి విద్యుత్ షాక్ తగలడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. ధర్మవరానికి చెందిన యువకుడు కాంట్రాక్ట్ కూలీగా పనిచేస్తున్నాడు. శనివారం మధ్యాహ్న సమయంలో కంపెనీ విస్తరణ పనులలో భాగంగా లిఫ్ట్ సహాయంతో పై అంతస్తులోకి నిర్మాణ సామగ్రిని తరలిస్తున్న క్రమంలో విద్యుత్ తీగలు తగలడంతో ఈ ప్రమాదం సంభవించింది. ఈ విషయం బయటకు పొక్కకుండా పరిశ్రమ యజమానులు మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్టు తెలుస్తోంది. కుటుంబ సభ్యులకు డబ్బు ఆశచూపి బయటకు రాకుండా చేస్తున్నారని, దీంతో పలువురు కార్మికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎస్సై వెంకటేష్‌ను వివరణ కోరగా తమకు ఎంటువంటి సమాచారం అందలేదన్నారు.